ఈనాడు

Date: 5th September,2018 Page no:03

# ఇన్‌కాయిస్‌లో 'సునామీ మాక్‌డ్రిల్'

## పశ్చిమ తీర ప్రాంతాల్లో 12 గంటల పాటు సాగిన కార్యక్రమం



అంతర్జాలం ద్వారా సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, నిజాంపేట న్యూస్‌టుడే: సునామీ వస్తే ప్రజలను ఎలా రక్షించాలి..? వారిని సురక్షిత తరలించాల్సిన పద్ధతులు, సమాచారాన్ని అందుకొని ప్రతిస్పందించడం వంటి అంశాలపై హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్ కేంద్రంలో 'సునామీ మాక్‌డ్రిల్‌'ను నిర్వహించారు. భారత జాతీయ మహాసముద్ర జలాల సమాచార, సునామీ హెచ్చరిక కేంద్రం (ఇన్‌కాయిస్)లో ఐవోవేవ్18 పేరుతో జరిగే రెండు రోజుల 'సునామీ మాక్‌డ్రిల్‌'ను మంగళవారం హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్ కేంద్రంలో ప్రారంభించారు. యునెస్కో ఆధ్వర్యంలో ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రఫిక్ కమిషన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ డ్రిల్‌లో 23 హిందూ మహా సముద్రతీర దేశాలు ఇక్కడి కేంద్రం నుంచి వెలువడిన సమాచారాన్ని అందుకున్నాయి. అరేబియా సముద్ర పరిధి మకరాన్ కేంద్రం ఆధారంగా ఈ మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ఇక్కడ 6.5 రిక్టార్ స్కేల్‌పై భూమి కంపించినట్లుగా మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. వాస్తవానికి భూమి 6.5కుపైగా కంపించినపుడు సునామీలు వస్తుంటాయి. అలాంటి సమయంలో సముద్ర తీర ప్రాంతాల అధికార యంత్రాంగంతో పాటు ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలో దీని ద్వారా తెలియజేస్తారు. ఉదయం 11.30 నుంచి రాత్రి 11.30 గంటల పాటు ఏకధాటిగా సాగిన ఈ డ్రిల్‌లో మొత్తం 15 బులిటెన్లను కేంద్రం విడుదల చేసింది. గుజరాత్, గోవా, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని సముద్ర తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. సునామీ హెచ్చరిక కేంద్రం ఇన్‌ఛార్జి రామారావు మాట్లాడుతూ ఇలాంటి మాక్‌డ్రిల్ ద్వారా సునామీ వచ్చినపుడు ఎలా అప్రమత్తమవ్వాలో స్పష్టం చేస్తాయన్నారు. బుధవారం అండమాన్‌లోని సుమత్రా కేంద్రంగా ఈ మాక్‌డ్రిల్ నిర్వహిస్తామన్నారు. దీనిద్వారా పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ పరిధిలోని తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు.